క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



మాచర్ల రూరల్: రక్తదానం ఎంతో విలువైనదని, ఆపదలో ఆదుకునేందుకు ఎంతగానో సహాయపడుతుందని, అలాంటి దానాన్ని చేయటం గొప్ప త్యాగమని స్టేట్ బ్యాంక్ బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎం.సతీష్ కుమార్ అన్నారు. ఎస్‌బీఐ 70 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని మెయిన్ బ్రాంచి ఆవరణలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా స్థాయిలో 70 వేల బ్యాంకు అకౌంట్లు ఉన్న ఏకైక సంస్థ మాచర్ల ఎస్‌బీఐ బ్రాంచికే దక్కుతోందని చెప్పారు. ఉద్యోగులు బాధ్యతగా సేవలందించటమే కాకుండా ఇలాంటి రక్తదాన శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం రోడ్డు ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ సంజీవ్ కుమార్, అశోక్ కుమార్, పున్నారావు, రబ్బాని, యశ్వంత్, షరీఫ్, సునీల్ కుమార్, సందీప్‌కుమార్, హరి, మనోహర శాస్త్రి, శిరీష, రత్న శ్రీ పాల్గొన్నారు.

ఘనంగా పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వార్షికోత్సవం



సత్రశాల(రెంటచింతల): స్థానిక పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ 20వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఫ్యాక్టరీ ఆవరణలో ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు, సీనియర్ కమర్షియల్ అధికారి జి.ధర్మారెడ్డి, ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్ తో వేద పండితులు పలు హోమాలు జరిపించారు. అనంతరం ఉద్యోగులకు పలు ఆటలపోటీలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో ఉద్యోగులు, కార్మికులు, పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సాయం



దుర్గి: మండల పరిధిలోని ఓబులేశునిపల్లె, కోట సైదయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సిహెచ్.నవ్య 590/600 మార్కులు సాధించింది. బుధవారం దుర్గి గ్రామానికి చెందిన విద్యా దాత పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు గూడా శ్రీనివాసరావు తన తల్లిదండ్రులు గూడా ఆదినారాయణ, కోటేశ్వరమ్మల జ్ఞాపకార్థం విద్యార్థిని నవ్యకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు భీమా అప్పారావు పాల్గొన్నారు.

మాచర్ల మండల సర్వేయర్‌గా సాల్మన్‌రాజు

మాచర్ల రూరల్: మాచర్ల మండల సర్వేయర్‌గా ఎస్.సాల్మన్‌రాజు బుధవారం విధుల్లో చేరారు. తహసీల్దార్ బి.కిరణ్ కుమార్‌ను కలసి బాధ్యతలు చేపట్టారు. మాచవరం మండల సర్వేయర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2023 సెప్టెంబర్‌లో సర్వే ఏడీ ఆఫీసు నుంచి డెప్యుటేషన్‌పై ఇక్కడకు వచ్చి కొద్ది కాలం పనిచేశారు.

మాచవరం ఎంపీడీఓగా చిరంజీవి



మాచవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.విష్ణు చిరంజీవి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరు జిల్లా రేణిగుంట ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఈఓపీఆర్‌డీ వెంగళరావు ఇన్‌చార్జి ఎంపీడీఓగా వ్యవహరించారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీకి చెందిన పగిడిపల్లి వెంకటేశ్వర్లు(50) భవన నిర్మాణ కార్మికుడు. మిర్యాలగూడెంలో పని చేసి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. నడికుడి విద్యుత్‌సబ్ స్టేషన్ వద్ద అతివేగంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావటంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అభిమాన నేతకు జన నీరాజనం

- అడుగడుగునా ఆంక్షలు... తగ్గని ఆదరణ
- పూలతో స్వాగతం పలికిన మహిళలు



సత్తెనపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం జరిగిన సత్తెనపల్లి పర్యటనపై పోలీసులు అడుగడుగునా ఆంక్షలు అమలు చేశారు. పోలీసుల ఆంక్షలను ఖాతరు చేయకుండా ద్విచక్ర వాహనాలపై పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు దాటుకుంటూ సత్తెనపల్లికి చేరుకొని జగన్‌మోహన్ రెడ్డికి అభిమానులు, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణ క్రోసూరు రోడ్డులోని రైల్వేగేట్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు పూలు, హారతితో స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ముప్పాళ్ళ నుంచి వాహనాలపై వచ్చే వారిని సైతం సత్తెనపల్లి పట్టణం ప్రారంభంలోని పరివర్తన ఆశ్రమ పాఠశాల వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. పలు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా ఆటోల్లో వచ్చిన మహిళలు అక్కడి నుంచి నడుచుకుంటూ పట్టణానికి చేరుకొని జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికారు.

పోలీసుల తీరుపై అభిమానులు అసహనం...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో భాగంగా కాన్వాయ్ రైల్వే గేట్ దాటే సమయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కాన్వాయ్‌తో పాటు ఉన్న వాహనాలను రైల్వే స్టేషన్ రోడ్డు వైపు దారి మళ్లించే ప్రయత్నం చేశారు. అయితే జగన్‌మోహన్ రెడ్డి వెంటే వెళ్లాలంటూ వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అయినప్పటికీ పోలీసులు ఖాతరు చేయకుండా వాహనాలను రైల్వే స్టేషన్ వైపు దారి మళ్లించటంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అదే సమయంలో రైల్వే గేట్ కూడా పడటంతో ట్రాఫిక్ జామ్‌తో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. గమనించిన సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు అక్కడికి చేరుకుని పోలీసులకు సర్ది చెప్పి పార్టీ శ్రేణులను కాన్వాయ్ వెంట రెంటపాళ్ల వైపు పంపించటంతో వివాదం సద్దుమణిగింది.



సత్తెనపల్లిలోని రైల్వేగేట్ వద్ద పూలతో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు

జగనన్న కోసం రెంటపాళ్ల తరలిన అభిమానులు

క్రోసూరు: సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామ ఉప సర్పంచ్, ఎన్నికల ఫలితాల సమయంలో కూటమి నాయకుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి, విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం హాజరైన సందర్భంగా క్రోసూరు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు, మహిళలు భారీగా తరలి వెళ్లారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు పెట్టినా లెక్క చేయకుండా ఎవరికి వారు పొలాల బాటలో పడి తరలి వచ్చారు. క్రోసూరు, పీసపాడు, ఊటుకూరు, బయ్యవరం, దొడ్లేరు తదితర గ్రామాల నుండి తరలి వెళ్లారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. క్రోసూరు మండలంలో ఎర్రబాలెం వద్ద పోలీసులు వాహనాలను వెళ్లకుండా అడ్డుకున్నారు. అదేవిధంగా పీసపాడు నుంచి నేరుగా రెంటపాళ్లకు ప్రధాన రహదారి మీదగా వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవటంతో పీసపాడు శివారు కట్టమూరు జంక్షన్ నుంచి పొలాల మీదగా అభిమానులు పెద్ద ఎత్తున రెంటపాళ్ల చేరుకున్నారు.

సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లో జగన్‌కు ఘన స్వాగతం

అచ్చంపేట : తమ అభిమాన నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఉదయం 9 గంటల నుంచి అభిమానులు నిరీక్షించారు. మధ్యాహ్నం 2.45 గంటలకు జగన్‌మోహన్ రెడ్డి సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌కు చేరుకోగానే వారి అభిమానం కట్టలు తెంచుకుంది. కరచాలనం చేసేందుకు తహతహలాడారు. సీఎం జగన్... సీఎం జగన్, జగన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

తరలివెళ్లిన అభిమానులు

రాజుపాలెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ఐదు లాంతర్ల సెంటర్‌లో రెంటపాళ్ల వెళ్లే మార్గంలో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఆ మార్గాన్ని దిగ్బంధం చేశారు. అధిక సంఖ్యలో పోలీసులు ఉదయం 7 గంటల నుంచే ఆ మార్గం నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధించారు. అభిమానుల తాకిడి తట్టుకోలేక మధ్యాహ్నం 2 గంటలకు చెక్‌పోస్టులు తీసివేశారు. జగనన్న ఐదు లాంతర్ల సెంటర్‌కు రావడంతో వేల సంఖ్యలో అభిమానులు, మహిళలు, కార్యకర్తలు ఒక్కసారిగా జై జగన్.. జై జగన్ అంటూ కేరింతలు కొట్టారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా అభిమానుల దెబ్బకు పటాపంచలయ్యాయి.

పోలీసులు ఆంక్షలను లెక్కచేయని నాయకులు

మండలంలోని నాయకులను, కార్యకర్తలను, అభిమానులను పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మండలంలోని ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో రెంటపాళ్లకు బుధవారం తరలివెళ్లారు. గత రెండు రోజుల నుంచి ప్రతీ గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి జగన్ పాల్గొనే రెంటపాళ్ల సమావేశానికి హాజరు కాకూడదని ఆంక్షలు విధించి భయభ్రాంతులకు గురి చేశారు. అయినా సరే లెక్కచేయకుండా కార్యకర్తలు స్వచ్ఛందంగా వందల సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై రెంటపాళ్ల చేరుకున్నారు. మండలంలో ఉదయం 6 గంటల నుంచే కొండమోడు జంక్షన్, రెడ్డిగూడెం, మొక్కపాడు వద్ద పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలను, ఆటోలను అనుమతించకపోవడంతో డొంక రోడ్డులు, పొలాల్లోను దారిని వెతుక్కుంటూ రెంటపాళ్ల చేరుకున్నారు.

అభిమానాన్ని ఆపలేరని నిరూపించిన పార్టీ నాయకులు

పెదకూరపాడు నియోజకవర్గం నుంచి భారీగా రెంటపాళ్లకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

అచ్చంపేట: ఎన్ని అడ్డంకులు పెట్టినా, ఎన్ని అవరోధాలు కల్పించినా, ఎన్ని ఆంక్షలు విధించినా అభిమానాన్ని ఆపలేరని పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు నిరూపించారు. అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, అమరావతి, పెదకూరపాడు మండలాల నుంచి జనసందోహం తరలి వచ్చింది. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు వచ్చే తమ అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగానికి బలైన మృతుడు కొర్లకుంట నాగమల్లేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లుకు మనోధైర్యం చెప్పి సంఘీభావం తెలియజేశారు. పోలీసులు అడుగడుగునా అవరోధాలు కల్పించారు. బైకులకు జెండాలు కట్టనివ్వలేదు, అసలు బైకులనే అనుమతించ లేదు, ఆటోలకు ఆటంకం కలుగజేశారు, కార్లకు సవాలక్ష ఆంక్షలు విధించారు. మీరు వెళ్లేందుకు వీల్లేదంటూ చెక్‌పోస్టుల వద్ద అటకాయించారు. అయినా మొక్కవోని ధైర్యంతో కొందరు పొలాల గట్ల వెంట, మరికొంత మంది వేరే దారుల్లో స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొమరాల రమేష్, రుద్రవరం గ్రామానికి చెందిన అనుముల సాంబిరెడ్డి, చల్లా శ్రీకాంత్, జాన్‌బాషా వందలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి వెళ్ల తమ ప్రియతమ నేతను వీక్షించడమే కాకుండా మృతుడు తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లుకు మేమున్నామంటూ మనోధైర్యాన్నిచ్చారు.



మృతుడు తండ్రి కొర్లగుంట వెంకటేశ్వర్లుతో అచ్చంపేట వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిన్నారుల అక్రమ రవాణా నేరం

నడికుడి రైల్వే ఎస్ఐ శ్రీనివాస నాయక్



పిడుగురాళ్ల: చిన్నారుల అక్రమ రవాణా చట్టపరంగా నేరమని ఇటువంటి వాటికి ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నడికుడి రైల్వే ఎస్ఐ వి.శ్రీనివాస నాయక్ హెచ్చరించారు. బుధవారం ఫలక్ నామ ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నడికుడి రైల్వే పోలీసులు, పిడుగురాళ్ల, గుంటూరు ఆర్‌పీఎఫ్ కలిసి గుంటూరు నుంచి పిడుగురాళ్ల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా రైలు బండిలో జార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్ నుంచి సికింద్రాబాద్ తీసుకెళ్తున్న ఏడుగురు బాలురను విడిపించారు. బాధ్యులైన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రైల్వే ఎస్ఐ మాట్లాడుతూ బాలురను సంరక్షణార్థం గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడులోని దీనమ్మ చైల్డ్ వెల్ఫేర్ అనాథాశ్రమానికి అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల ఎస్ఐ ఎన్.హుస్సేన్, గుంటూరు క్రైమ్ బ్రాంచ్ ఏఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించాలి



గురజాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని కౌన్సిలర్ నెలవల్లి బొల్లయ్య కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు పంపిణీ చేశారు. బొల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ చాగంటి శ్రీనివాసరావు, నెల్లూరి మల్లయ్య, శరమాళ్ల హనుమంతరావు, నాగేంద్రం, సూపర్‌వైజర్ వై.రత్నకుమారి పాల్గొన్నారు.

రెంటపాళ్లకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సంఘీభావం తెలుపుతున్న మండల కన్వీనర్ ప్రసాద్ తదితరులు

మాచవరం: సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్లలో కూటమి ప్రభుత్వం వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నాగమల్లేశ్వరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకను పురస్కరించుకొని సంఘీభావం తెలిపేందుకు మండల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకం ఉందన్నారు. ఏడాదికే కూటమి ప్రభుత్వం పని అయిపోయిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలని అన్నారు. తరలివెళ్లిన వారిలో మండల కన్వీనర్ మద్దు ప్రసాద్, మండల నాయకులు దారం లచ్చిరెడ్డి, అనిల్‌కుమార్, రాంబాబు, సర్పంచి నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైఎస్ జగన్ పర్యటనకు తరలిన కార్యకర్తలు, నాయకులు

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీగా తరలివెళ్లారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్ల పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా వెళ్లారు. వెళ్లిన వారిలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ జాను, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచి మందపాటి రమేష్ రెడ్డి ఉన్నారు.

వైఎస్ జగన్ పర్యటనకు తరలివెళ్లిన నాయకులు

గురజాల: సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ల గ్రామానికి విచ్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు గురజాల నుంచి భారీగా తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛందంగా వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

అడుగడుగునా అడ్డంకులు

- కొండమోడు జంక్షన్ లో జగన్ కోసం వెళ్లే వారిని అడ్డుకున్న పోలీసులు
- వైఎస్సార్ సీపీ నాయకులకు పోలీసుల నోటీసులు



కొండమోడు వద్ద కారుని అడ్డుకుంటున్న పోలీసులు

పిడుగురాళ్ల: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటనకు వెళ్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడు జంక్షన్ వద్ద తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేశారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలంలోని రెంటపాళ్ల గ్రామంలోని ఉపసర్పంచి నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి, విగ్రహ ఆవిష్కరణ చేసేందుకు బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ఉదయాన్నే బయలుదేరారు. పోలీసులు పట్టణ సమీపంలో కొండమోడు జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసులు అడుగడుగునా ఆంక్షలతో వాహనదారులను ఇబ్బందులకు గురి చేశారు. మరి కొంతమంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చి సత్తెనపల్లి జగన్ మోహన్ రెడ్డి కార్యక్రమానికి అనుమతులు పూర్తిస్థాయిలో లేవని నోటీసులు ఇచ్చారు. నాయకులతో పాటు యువకులను పోలీసులు జగన్ కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సత్తెనపల్లి వైపు వెళ్లే ప్రతి కారును పోలీసులు తనిఖీలు చేశారు. మరి కొన్ని కార్లను వెళ్లనివ్వకుండా అడ్డుపడ్డారు. గురజాల నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలోనే వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు భారీ సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారు.



ట్రాలీ వాహనాన్ని తనిఖీలు చేస్తున్న పోలీసులు



కొండమోడు జంక్షన్ వద్ద...

మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పిడుగురాళ్ల: మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ చేయాలని సీఐటీయూ పిడుగురాళ్ల మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణం మొత్తం శుభ్రంగా ఉంచి, పర్యావరణాన్ని కాపాడే పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు తమ బ్యాంకు ఖాతాలో జమ చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.25 వేలు వేతనం పొందే ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అమలు చేస్తామని హామీ ఇచ్చి, నేడు పట్నంలో రూ. 12,000 గ్రామాల్లో రూ.10,000 ఆదాయంలోపు వారికి వర్తింపజేస్తారని నిబంధన పెట్టటం అన్యాయంగా పేర్కొన్నారు . అభివృద్ధి, సంక్షేమం, స్వచ్ఛత అని ఊదలగొట్టే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం పట్టదా అని ఆయన ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే జీఓ నంబర్ 26 ప్రకారం తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో జమ చేయాలని లేని పక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కమిషనర్ ఇరువురు శ్రీనివాసులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పారిశు కార్మికులు బత్తుల రామారావు, అంగిడి ఆంజనేయులు, పరమేశ్వర, ఎం.ప్రతాప్, ఏ లక్ష్మి, బ్రహ్మయ్య, ఇంజినీరింగ్ కార్మికులు వేముల శీను, కాపురి విజయ్ , రమేష్, గద్దె శ్రీను పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 12 మందికి గాయాలు

పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల గ్రామంలో బుధవారం పిచ్చికుక్క దాడి చేయగా 12 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వారిలో నలుగురు చిన్నారులున్నారు. పిచ్చికుక్క దాడిలో గ్రామానికి చెందిన పాటిబండ్ల స్వాతి, పాటిబండ్ల మహేష్, పాటిబండ్ల జాషువారత్నకుమార్, పాటిబండ్ల బ్లెస్సి, ప్రస్త, పాటిబండ్ల పాములు, పాటిబండ్ల సామ్రాజ్యం, మండపల్లి నాగమణి, బంక నవీన్, కుక్కమల్ల దివ్య, తమ్మి జోసెఫ్, మెయిజే తదితరులు గాయాలపాలయ్యారు.

సీపీఐ మండల కార్యవర్గం

అచ్చంపేట : అచ్చంపేట మండల సీపీఐ మండల కార్యవర్గాన్ని నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా షేక్ మస్తాన్ బుజ్జితో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఈనెల 21న పిడుగురాళ్లలో జాబ్ మేళా

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 21వ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గవర్నమెంట్ జూనియర్ కళాశాల పిడుగురాళ్ల ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివరాల కోసం పి.శ్రీకాంత్ 9492158153, రమ్య 7702921219, సురేష్-9100566581 సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముప్పాళ్ళ: మండలంలోని విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ పరిధిలోని దమ్మాలపాడు ఫీడర్ లైన్ మరమ్మతులో భాగంగా పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 19వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జీ సుచరిత బుధవారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం, పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బాలెమర్రు ఎంపీపీ పాఠశాలకు అదనపు ఉపాధ్యాయ పోస్టు

బాలెమర్రు(క్రోసూరు): మండలంలోని బాలెమర్రు ఎంపీపీ పాఠశాలకు అదనంగా ఉపాధ్యాయ పోస్టు భర్తీ అయినట్లు పాఠశాల హెచ్ఎం శరత్ బుధవారం తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఏకోపాధ్యాయ ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగటంతో ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా అదనంగా ఉపాధ్యాయ పోస్టు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలు విప్పర్ల సాహిత్యకుమారి చేరినట్లు పేర్కొన్నారు. అదనపు పోస్టు రావటం పట్ల గ్రామస్తులు, ఎస్ఎంసీ అధ్యక్షుడు బి.రాధాకృష్ణ సంతోషం వ్యక్త పరిచారు.